క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న ఐ బ్యాంకు నిర్వాహకులు

బాలాజీచెరువు: నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం బాదం బాలకృష్ణ ఐబ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐ బ్యాంక్ వైస్ చైర్మన్ కొల్లేపల్లి మురళీకృష్ణ మాట్లాడుతూ కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్నవారు సైతం నేత్రదానం చేయవచ్చని, నేత్రదానం ద్వారా అంధులకు వెలుగులు ప్రసాదించవచ్చన్నారు. కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు నేత్రదాన అంగీకార పత్రం అందజేసి ఆర్టీసీ ఉద్యోగులకు నేత్రదాన అవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో పీఆర్‌ఓ వెంకట్రాజు, ఐబ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్రం అభివృద్ధికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

బోట్‌క్లబ్: మంత్రిప్రగడ సత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సత్రం ఈఓ సీహెచ్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సత్రం ఈఓగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సత్రం ఈఓగా పనిచేసిన కె.సుబ్రహ్మణ్యం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో గాంధీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సత్రంలో పేద విద్యార్థులకు అమలవుతున్న ఉచిత భోజన పథకాన్ని మరింతమందికి అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మానవతా విలువలపై అవగాహన

బాలాజీచెరువు: స్థానిక సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ డీఎస్ శ్యామలచే మానవతా విలువలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో మానవతా విలువలు లోపించటంతో వివిధ రకాల అవాంఛిత సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు. నిబద్ధత, మంచి చెడు ఆలోచించేతత్వం, కోల్పోవటం వల్ల యువత తమ నిర్దేశిత లక్ష్యాలను సాధించలేక పోతున్నారన్నారు. అలాంటి రోజుల్లో సత్యసాయి సేవా సమితి వారు విద్యార్థినీలకు «ట్రాన్స్‌ఫార్మ్ యువర్ సెల్ఫ్, టు ట్రాన్స్‌ఫార్మ్ వరల్డ్» అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖాదేవి, పీడీ ఎన్.సత్యవతి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలి

- పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామశర్మ
- కొంగోడులో కార్యక్రమం ప్రారంభం



రైతులకు ఎలుకల మందును అందజేస్తున్న వ్యవసాయాధికారులు

కరప: సార్వాలో వరి పంటకు ఎలుకల బెడద ఉందని, ఎలుకల నివారణకు రైతులందరూ సామూహికంగా చర్యలు చేపడితేనే ఫలితముంటుందని పెద్దాపురం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎ.సీతారామశర్మ అన్నారు. మండలం కొంగోడులో బుధవారం ఆయన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వరిపంటకు ఎలుకల వలన ఎక్కువ నష్టం వాటిల్లుతోందన్నారు. ఎలుక తినేది తక్కువ, పాడుచేసేది ఎక్కువ అన్నారు. ఎలుకలను అంతం చేయడానికి చాలా పద్ధతులు ఉన్నాయని, ఎలుక బొరియలను మట్టితో కప్పి, పొగపెట్టి నివారించవచ్చునని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసే బ్రోమోడయొలిన్ మందు ద్వారా అరికట్ట వచ్చన్నారు.

ఈ సందర్భంగా 480 గ్రాములు నూకలు, 10 గ్రాములు మంచినూనె, 10 గ్రాములు బ్రోమోడయొలిన్ మందును ప్రయోగాత్మకంగా కలిపించి, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి, మందుకలిపిన నూకలను పొట్లాలుగా కట్టి, ఎలుకల బొరియల వద్ద పొట్లాలను ఉంచి చూపించారు. మందు కలిపిన నూకలను తిన్న తర్వాత ఎలుకల్లో రక్తం గడ్డకట్టి చనిపోతాయన్నారు. రైతులు ముందురోజు పొలంగట్లపై ఉండే ఎలుకల కన్నాలను మూసివేయాలని, మరుసటిరోజున ఎలుకలున్న కన్నాలు తెరుచుకుంటాయని అక్కడ ఎలుకల మందు కలిపిన పొట్లాలను ఉంచాలన్నారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ ప్రతి పంటలో 10 నుంచి 20 శాతం ఎలుకల బెడదవల్లనే నష్టం వాటిల్లుతోందన్నారు. మండలానికి 63 కిలోల బ్రోమోడయొలిన్ మందు వచ్చిందని, రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఉచితంగా ఇస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. రైతులందరూ ఎలుకల నివారణ చర్యలను సామూహికంగా చేపట్టి, వరిపంటను కాపాడుకోవాలన్నారు. సర్పంచ్ నక్కా అప్పలస్వామి, ఉప సర్పంచ్ వనుం నారాయణస్వామి, ఎంపీఓ ఇమ్మిడిశెట్టి సత్య, ఏఈఓలు ఎంవీ సతీష్, బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



కొంగోడులో పొలంగట్లపై ఎలుకల మందు కలిపిన పొట్లాలను బొరియల వద్ద ఉంచుతున్న వ్యవసాయాధికారులు

దక్షిణాయణంలో వేద శ్రవణం శ్రేయస్కరం



వేణుగోపాల ప్రచారసభలో మాట్లాడుతున్న రచయిత జానకిరామ చౌదరి

బోట్‌క్లబ్: దక్షిణాయణంలో వచ్చే వర్ష రుతువులో సృష్టి ఆరంభమైందని, ఈ కాలంలో వేద పండితులకు ఆతిథ్యం ఇచ్చి సన్మానించి వారు ఆలపించే వేదాన్ని వినడం సకల శ్రేయోదాయకమని వేణుగోపాల ప్రచారసభ గౌరవ సలహాదారు, ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ సూచించారు. సంస్కృత ప్రచార సభలో గణపతి నవరాత్రుల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన దక్షిణాయన విశిష్టత వివరించారు. దక్షిణాయణంలో ఆధ్యాత్మికంగా జీవితాన్ని తీర్చిదిద్దుకుంటే ఉత్తరాయణం పుణ్యకాలంగా అనుభవంలోకి వస్తుందన్నారు. ఆషాఢ, శ్రావణ, భాద్రపద ఆశ్వయుజ, కార్తిక, మార్గశిర మాసాల్లో ఏ విధంగా ఆచరణ ఉండాలో సనాతనం చెప్పిందని ఆయన వివరించారు. అమెరికా వంగూరి ఫౌండేషన్ చైర్మన్ చిట్టెన్ రాజు మాట్లాడుతూ ఎంతో ప్రాచీనమైన సంస్కృత ప్రచార సభ ఈశ్వర పుస్తక భాండాగారం ద్వారా సమాజానికి ఉపయోగపడే విలువైన కార్యక్రమాలు ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ప్రముఖ రచయిత మార్ని జానకిరామ చౌదరి మాట్లాడుతూ సంస్కృత ప్రచార సభ సంస్కృతిని సంప్రదాయాలను ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రచార సభ ఉపాధ్యక్షుడు గంటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



సూర్యారావుపేట బీచ్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ రూరల్: మండల పరిధిలోని సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. ఈ నెల 6న కాకినాడ నగరం, రూరల్ మండలంలోని పలు గ్రామాల నుంచి మండపాలలోని గణేష్ విగ్రహాలను భారీగా బీచ్‌లో నిమజ్జనం చేయనున్నారు. బీచ్ వద్ద నిమజ్జనోత్సవానికి వచ్చే భక్తులతో సౌకర్యాలతో పాటు రక్షణ పరంగా తీసుకునే చర్యలపై ఆయన అధికారులతో చర్చించారు. విగ్రహాలను సముద్రం వరకు తీసుకువెళ్లేలా గ్రావెల్ రోడ్లు, క్యూ లైన్లు, స్టేజ్, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు మెరుగైన పారిశుధ్య చర్యలు చేపడుతున్నట్టు డీపీఓ రవికుమార్, ఎంపీడీఓ సతీష్, డిప్యూటీ ఎంపీడీఓ సీతారామంజనేయులు తదితరులు జేసీకి వివరించారు.

సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి

బోట్‌క్లబ్: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు చేయాలని కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అన్నారు. ఈ నెల 5, 6 తేదీలలో జరిగే గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. బ్రహ్మం గారి మఠం, వినాయక్ సాగర్, ఒకటో పట్టణ పోలీసు స్టేషన్, జవహర్ జట్టి వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విద్యుత్, తాగునీరు పారిశుధ్య పనులు, భారీ క్రేన్లు ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన ప్రాంతంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు.

కన్నబాబుకు బొత్స పరామర్శ



కాకినాడలో మాజీ మంత్రి కన్నబాబును పరామర్శించి ఆయన తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొత్స సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబును శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, పలువురు నేతలు బుధవారం పరామర్శించారు. కాకినాడ వైద్యనగర్ నివాసంలో కన్నబాబును కలిసి ఆయన తండ్రి సత్యనారాయణ చిత్ర పటానికి నివాళులర్పించారు. కన్నబాబును పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, అనంత ఉదయ్‌భాస్కర్, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రామారావు, నేతలు ఆలూరి సాంబశివారెడ్డి, దవులూరి దొరబాబు, సినీ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ ఉన్నారు.

డీఎస్సీ విజేతలకు అభినందనలు




డీఎస్సీ అభ్యర్థులను అభినందిస్తున్న కార్యదర్శి వెంకటరావు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకుని డీఎస్సీ–25లో ఉద్యోగాలకు అర్హత సాధించిన 12 మంది అభ్యర్థులను బుధవారం సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటరావు తన చాంబర్‌లో వారిని అభినందించి యువతీ యువకుల భవిష్యత్‌కు మార్గదర్శిగా గ్రంథాలయం ఉందని, వాటిలో ఉన్న పుస్తకాలు, దినపత్రికలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్ పోటీ పరీక్షల అభ్యర్థులకు మీరందరూ మార్గదర్శకంగా నిలుస్తారని, అభ్యర్థుల డిమాండ్ మేరకు కావలసిన పుస్తకాలు అన్నీ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి కిశోర్, సీనియర్ అసిస్టెంట్ శ్రావ్య, సిబ్బంది రాజు, సాయి వెంకటరావు, నాగేంద్రకుమార్, వీర్రాజు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

బాలాజీచెరువు: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గీతమ్ పాఠశాలలో బుధవారం సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. విద్యార్థులు గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు రక్షించేందుకు దోహదపడే మెళుకువలు వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తడాల సత్యనారాయణ, కార్యదర్శి సత్య, ప్రిన్సిపాల్ సురభి శారద పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సాలిపేటలోని గణపతి

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డు లోని సాలిపేటలో ఉన్న వినాయకుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జి.చిట్టిబాబు, ఆలయ ఈఓ ఎం.మురళీ వీరభద్రరావు ఆధ్వర్యంలో ఉదయం సహస్రనామార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోలేపల్లి జగన్, మన్యం వీరవెంకట శ్రీనివాసరావు, పట్నాల వెంకటరమణ పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ ప్రవచనం



హనుమత్ ప్రవచనం నిర్వహిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

తుని రూరల్: బుద్ధిబలం, మనోబలం కలిగిన వ్యక్తి హనుమ ఒక్కరేనని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి తుని శివారు గెడ్లబీడు సమీప సాయివేదికలో హనుమత్ వైభవం ప్రవచన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చాగంటి హనుమత్ వైభవాన్ని విశేషంగా చెప్పారు. హనుమ బుద్ధి, గొప్పతనాన్ని మొదట చెప్పింది సుగ్రీవుడు, జాంబవంతుడే అని అన్నారు. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదట రోజు రెండు గంటలపాటు ప్రవచనం నిర్వహించారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది హాజరై ప్రవచనాన్ని విన్నారు.

నర్సింగ్ నైపుణ్యంపై అవగాహన

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామం రాయుడుపాలెంలోని శారా నర్సింగ్ స్కూల్ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యంపై ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) బుధవారం అవగాహన కల్పించింది. హైదరాబాద్‌లోని డాల్ఫిన్ టెక్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ నర్సింగ్ సెంటర్ ట్రైనింగ్ డైరెక్టర్ లక్ష్మీరావు విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యంపై అవగాహన కల్పించారు. దేశంలో కార్పొరేట్ ఆస్పత్రులతో పాటు విదేశాలలో ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందేందుకు తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ అధ్యక్షత వహించగా శారా నర్సింగ్ స్కూల్ సిబ్బంది, ఏఐసీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్ల నియామకానికి ఉత్సాహవంతులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ పోస్టల్ సూపరిండెంట్ దాసరి నాగేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వయస్సు 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులను కాకినాడ పోస్టల్ ప్రధాన కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

బోట్‌క్లబ్: ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక దేవాలయం వీధిలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారాన్ని బుధవారం నిర్వహించారు. ధర్మకర్తల మండల చైర్మన్‌గా వెత్సా మురళి, సభ్యులుగా ప్రగలపాటి అరుణ్ కుమార్, ఓలేటి సత్య, వి.కృష్ణ, మండపాక సూర్యనారాయణమూర్తి, చిరుకూరి శ్రీనివాసరావు, చోడుపల్లి సత్యవతి, పి.లక్ష్మి, ఆటవ మధుశ్రీ, మాతా దీప్తి ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులతో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి ఐదు రోజులు, 8 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 12 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బుధవారం కోర్టులో 21 మందిని హాజరుపరచగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.